క్లుప్తంగా

ప్రజా సమస్యలను ప్రశ్నిస్తే నోటీసులా!



పామర్రు: ప్రజా సమస్యలను ప్రశ్నించి పోరాడేందుకు వెళుతుంటే పోలీసులు నోటీసులు ఇవ్వడం అన్యాయమని.. కూటమి ప్రభుత్వంలో ప్రశ్నించే గొంతుకను నొక్కడం పరిపాటిగా మారిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో పెదపారుపూడి ఎస్‌ఐ, పామర్రు సీఐలు గురువారం మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పెదపారుపూడి మండలం నాగాపురంలోని 10 ఎకరాల చెరువు భూమిని కూటమి నేతలతో కలిసి సదరు భూమి యజమాని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ విషయమై నిజ నిర్ధారణ చెపట్టేందుకు చెరువు వద్దకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో వెళ్లి వద్దని పోలీసులు నోటీసును అందజేశారని తెలిపారు. పేదలకు అన్యాయం చేస్తున్నారని.. దీనిని ప్రశ్నించేందుకు వెళుతున్న నాకు నోటీసులు పంపడం అన్యాయమని ఆయన వివరించారు.

సృజనాత్మకతతో విజయాలు సాధించాలి

గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే సృజనాత్మకతతో ఆలోచించాలని మచిలీపట్నం ఏజీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డీఎస్ఎన్ శాస్త్రి అన్నారు. గురువారం స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో 'సృజనాత్మకత.. ఆలోచనాధోరణి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యనభ్యసించే సమయంలో కొన్ని అంశాలు మాత్రమే పుస్తకాల్లో ముద్రిస్తారని పేర్కొన్నారు. కానీ అభ్యసించే సమయంలోనే పాఠ్యాంశాలలోని మూలాలను గుర్తించి వాటి ద్వారా విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచించి నైపుణ్యతను పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సృజనాత్మకత మెళకువలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు సీహెచ్ ప్రకాష్, డీఎస్ ప్రత్యూష, వి.సువర్ణలక్ష్మి, ఎ.సునీత, ఎన్.నాగలక్ష్మి, ఎ.సుఖీల, వి.గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి



గుడ్లవల్లేరు: ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని గుడివాడ డివిజినల్ పంచాయతీ అధికారి సంపత్ కుమారి ఆదేశించారు. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామ పంచాయతీని ఆమె గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గుడ్లవల్లేరు డిప్యూటీ మండల పరిషత్ అభివద్ధి అధికారి అంజనా దేవితో కలిసి పంచాయతీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. శానిటేషన్‌లో భాగంగా చెత్త సేకరణను పరిశీలించారు. అలానే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లో క్లోరినేషన్ ఎలా జరుగుతుందో పరిశీలించి డ్రై వేస్ట్, వెట్ వేస్ట్ సెగ్రిగేషన్, చెత్త సంపద షెడ్‌లను పరిశీలించారు. పర్యటనలో పంచాయతీ కార్యదర్శి బలగం వెంకట రమణ, ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



వెంకట్రావు



రామకృష్ణ

గుడ్లవల్లేరు: యూటీఎఫ్ గుడ్లవల్లేరు మండల నూతన కార్యవర్గాన్ని గుడివాడ అంబేద్కర్ భవన్‌లో బుధవారం రాత్రి ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్ గురువారం విలేకరులకు తెలిపారు. యూటీఎఫ్ గుడ్లవల్లేరు మండల నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా డి.వి.ఎం.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె.వెంకట్రావు గుడ్లవల్లేరు మండల కౌన్సిల్ సమావేశంలో ఎన్నిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీ బొడ్డు నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, కృష్ణాజిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బి.కనకారావు, గౌరవ అధ్యక్షుడు లెనిన్ బాబు, ఎన్నికల అధికారిగా ఎస్.ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

ముదినేపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దేవపూడి, ప్రొద్దువాక, వణుదుర్రు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన గురువారం ప్రారంభించారు.

మెమో నంబర్ 57 ప్రకారం పాత పింఛను ఇవ్వాలి

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛను విధానం వర్తింపజేయాలని డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.లక్ష్మీ శ్రీనాథ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ ఉపాధ్యాయులు 7,361, పోలీసులు 1,821, గ్రూప్–1 ఉద్యోగులు 1,800 మంది ఇందుకు అర్హులని తెలిపారు. దీనిని ప్రభుత్వం అమలు చేయడంలో అలసత్వం వహిస్తోందని ఆయన వివరించారు. తక్షణమే ప్రభుత్వం మెమో నంబర్ 57 అమలయ్యేలా జీవో విడుదల చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఎస్సీ జిల్లా కన్వీనర్ జి.జయరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏవీ వరలక్ష్మి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, ఎంవీ బేతాళరావు, బెనర్జీ, కృష్ణకాంత్, రమేష్, సుజాత, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం

ముదినేపల్లి రూరల్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వంపై నిరంతరంగా పోరాటం చేస్తూనే ఉంటామని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కృపాకర్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే నిరసనవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ముదినేపల్లిలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 4 డీఏలు చెల్లించాల్సి ఉందని, సీపీఎస్ రద్దు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ అమలు జరగలేదని విమర్శించారు. అనేక మంది ఉపాధ్యాయులు నూతన పీఆర్సీ తీసుకోకుండానే ఉద్యోగ విరమణ చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ముదినేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా హాజరు కావాలని ఆయన కోరారు.



కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు

అటవీ అమరవీరులకు ఘన నివాళులు

కైకలూరు: విధి నిర్వాహణలో అసువులుబాసిన అటవీ అమరవీరుల త్యాగాలను అందరూ స్మరించుకోవాలని అటవీ వన్యప్రాణి యాజమాన్య విభాగం జిల్లా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కె.రామలింగ చార్యులు తెలిపారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా గురువారం అటవీ సిబ్బంది కైకలూరు రేంజ్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి కైకలూరు మాగంటి థియేటర్ జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. కార్యాలయం వద్ద గంధపు స్మగ్లర్ వీరప్పన్ చేతుల్లో అసవులుబాసిన ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన అటవీ ఐఎఫ్ఎస్ అధికారి పందిర్లపల్లి శ్రీనివాస్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం రేంజ్ ఆఫీసర్ రామలింగచార్యులు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం.రంజిత్ కుమార్, ఎఫ్ఎస్‌వో రాంబాబు, ఫారెస్టు బీట్ ఆఫీసర్లు, అసిస్టెంటు బీటు ఆఫీసర్లు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



మానవహారంగా కైకలూరు ఫారెస్టు సిబ్బంది

బాబా ఆలయంలో అన్నసమారాధన

మండవల్లి: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద గల శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుతగా బాబాకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండవల్లి పరిసర గ్రామాలైన గన్నవరం, పెరికెగూడెం, కొర్లపాడు, అయ్యవారిరుద్రవరం తదితర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: స్థానిక కూరగాయలు, పండ్ల వర్తకసంఘం ఆధ్వర్యంలో అడవినాయుడు సెంటర్‌లో 51వ వార్షిక ఆది వినాయక చవితి వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన గురువారం నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి 6,000 పైగా భక్తులు సమారాధనకు హాజరయ్యారు. కైకలూరు తాత్కాలిక సర్పంచ్ కేవీఎస్ఎం.నాయుడు, కమిటీ సభ్యులు గుగ్గిలపు చిన్నా, రామకృష్ణ, ప్రసాద్, కొండెటి వెంకన్న, పంజా రాంబాబు, ఏసు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జంగంపాడు విద్యార్థులు

కైకలూరు: కళా ఉత్సవ్–2025 పేరుతో అంగలూరు డైట్ కాలేజీలో కృష్ణాజిల్లా స్థాయిలో గురువారం నిర్వహించిన పోటీలలో కైకలూరు మండలం జంగంపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇరువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థులు కర్రి కావ్యశ్రీ రుద్రమదేవి ఏకపాత్రాభినయంతో జిల్లాస్థాయి 3వ స్థానం, ఒడుగుదీనా చిత్రలేఖనంలో వికసిత్ భారత్ 2047 థీమ్‌లో 2వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొననున్నారు. డైట్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, సీనియర్ అధ్యాపకులు పాకల వినయ్‌కుమార్ విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, గైడ్ మాస్టారుగా వ్యవహరించిన పి.సురేష్ కుమార్‌ను కైకలూరు మండల ఎంఈవో డి.రామారావు అభినందించారు.



ఏకపాత్రాభినయంలో బహుమతి పొందిన కావ్యశ్రీ

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

కైకలూరు: వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులు, అధ్యాపకులు కలిపి మొత్తం 155 మందికి కైకలూరు మగువ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు శంకర్ నేత్ర ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత మాట్లాడుతూ.. ఫోన్‌ను అధికంగా వాడడం వల్ల కంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.సంధ్య మాట్లాడుతూ.. కంటి సమస్యలను ప్రారంభ దశలో గుర్తిస్తే సులభంగా పరిష్కరించవచ్చన్నారు. నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కంటి పరీక్షలు చేసిన వారిలో 35 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు గుర్తించారు. కార్యక్రమంలో కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారి ఎం.విజయ్‌కుమార్, లయన్స్ క్లబ్ కార్యదర్శులు ఎస్.మాధవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో నిర్వహిస్తున్న కంటి పరీక్షలు

పెడనలో సివిల్ సప్లయి అధికారుల దాడులు

ఒక చోట పట్టుకుని..
మరోచోట వదిలేయడంపై విమర్శలు

పెడన: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో గురువారం పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ ఆదేశాలతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో అధికారులు దాడులు చేశారు. గూడూరు రోడ్డులోని మజీద్ ప్రాంతంలోను, పిండిమర వద్ద, రైలు గేటు, ఎన్టీఆర్ పార్కు, ఎన్టీఆర్ క్యాంటీన్ వెనుక అనుమానాస్పదంగా ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎన్టీఆర్ క్యాంటీన్ వెనుక ఎస్.వెంకటప్రసాద్(నాని) అనే వ్యక్తి వద్ద నాలుగున్నర క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం లభ్యమయ్యాయి. దీనిపై అధికారులు కేసు నమోదు చేశారు. అలాగే గూడూరు రోడ్డులోని పిండిమర వద్ద మహమదా అనే వ్యక్తి వద్ద నాలుగు బస్తాలు లభ్యమైనా అధికారులు ఎటువంటి కేసు నమోదు చేయకుండా విడిచిపెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. రాజకీయ సిఫార్సులు చేసిన వారిని వదిలిపెట్టడం, సిఫార్సులు లేనివారిపై అధికారుల పెత్తనం చేయడం పట్ల పురప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. న్యాయం అందరికి ఒకే విధంగా చేయాలని, పట్టుకుంటే అందరిని పట్టుకోవాలి లేదా వదిలేయాలనే వాదన పురప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా అధికారుల తీరు ఆక్షేపనీయంగా మారిందని వారు ఆరోపిస్తుండటం విశేషం. ఈ దాడుల్లో పీడీఎస్ డీటీ నాగమల్లేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఈఢే విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ క్యాంటీన్ వెనుక పట్టుకున్న పీడీఎఫ్ బియ్యం వద్ద అధికారులు

మధ్యాహ్న భోజనం పరిశీలన



మండవల్లి: స్థానిక ప్రాథమిక పాఠశాల–1 (ఎంపీపీ స్కూల్), అంగన్‌వాడీ కేంద్రం–4లో గురువారం సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు సర్పంచ్ స్వయంగా వడ్డన చేశారు.

నేడు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు

గుడివాడ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు శుక్రవారం స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో జరుగుతుందని అంబేడ్కర్ విగ్రహ సాధికార కన్వీనర్ పొంగులేటి జయరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో సాయంత్రం 5 గంటలకు ఈ విగ్రహ ఏర్పాటు ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు విగ్రహం నాగవరప్పాడు వంతెన వద్దకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి భారీ ర్యాలీతో నెహ్రూచౌక్ వరకు విగ్రహాన్ని ఊరేగింపుగా తరలిస్తామన్నారు. ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఈనెల 30వ తేదీన ఆవిష్కరిస్తామని ఆయన వివరించారు. ర్యాలీలో దళిత నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

సృజనాత్మకతతో విద్యార్థుల ప్రతిభ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్ ఇప్పటికే పలువురి దృష్టిని ఆకర్షించింది. ఈ గార్డెన్‌లో కూరల పెంపకంతో పాటు పైనాపిల్, సీతాఫలాలను విద్యార్థులు పండించారు. ఇదే రీతిలో ఉపాధ్యాయులు శ్రద్ధతో బోధనాభ్యాస సామాగ్రిని ఏ విధంగా వినియోగించవచ్చో ఈ పాఠశాల విద్యార్థులు ప్రయోగాత్మకంగా నిరూపించారు. ఐదో తరగతి చదువుతున్న యమున, నిస్సీ మట్టితో ఊపిరితిత్తులు తయారు చేశారు. ఉపాధ్యాయులు బేతాల రాజేంద్రప్రసాద్, సీహెచ్ చక్రధర్ శ్రద్ధ తీసుకుని బోధనాభ్యాస సామాగ్రి వినియోగించడంలో మెళకువలు నేర్పినట్లు విద్యార్థులు తెలిపారు.

ఉరివి చెరువు పంచాయితీపై డీఎల్‌పీవో ఆరా



పెడన: మండలంలోని ఉరివి గ్రామంలో ఉన్న పంచాయతీ చెరువుకు గత పదేళ్లుగా వేలం పెట్టకపోవడంపై మచిలీపట్నం డీఎల్‌పీవో జి.పద్మావతి గురువారం ఆ గ్రామంలో పర్యటించి ఆరా తీశారు. పంచాయతీ చెరువు పరిధి పెడన మండలం ఉరివి గ్రామంలో 80 శాతం, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడిలో 20 శాతం ఉండటంతో ఇరు గ్రామాల మధ్య ఈ పంచాయితీ తేలడం లేదని తెలుసుకున్న డీఎల్‌పీవో రెండు గ్రామాలకు చెందిన పెద్దలతో పెడనలో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరించుకునేలా చర్చించుదామని గ్రామస్థులకు సూచించారు. ఆ గ్రామంలో రోడ్డు కావాలని గ్రామస్థులు కోరడంతో అందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పెనుమల్లి గ్రామంలో పర్యటించారు. సమిత్వ సర్వేపై ఆరా తీశారు. ఈ పర్యటనలో పెడన ఎంపీడీవో ఎ.అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లోకి దూసుకుపోయిన ట్రాక్టర్



కప్తానుపాలెం(మోపిదేవి): మండలంలోని కప్తానుపాలెం 9వ నెంబర్ కాలువ వద్ద 216 జాతీయ రహదారి పక్కన ఉన్న పెద్ద డ్రెయిన్‌లోకి ట్రాక్టర్ దూసుకుపోయింది. గ్రామస్తుల కథనం మేరకు.. గురువారం మొవ్వ మండలం అయ్యంకి గ్రామం నుంచి రేపల్లెకు దమ్ము వీల్స్‌తో వెలుతున్న టాక్టర్ అదుపుతప్పి డ్రెయిన్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ గిరిబాబుతో పాటు మరో రైతుకు గాయాలు కావడంతో 108లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు గిరిబాబును విజయవాడ అక్కడ నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వైఎస్సార్ సీపీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

తాడేపల్లి పార్టీ కార్యాలయం నుంచి
నియామక ఉత్తర్వులు

కైకలూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు, ముదినేపల్లి మండలాల అనుబంధ విభాగాల అధ్యక్షుడితో పాటు కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ మైనార్టీ విభాగ అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు తాడేపల్లి పార్టీ కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు విడుదల చేశారు.

కైకలూరు మండలంలో నియామకాలు..

కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ మైనారిటీ విభాగ అధ్యక్షుడిగా కలిదిండి రెహమాన్ నియమితులయ్యారు. కైకలూరు మండలం అనుబంధ విభాగ అధ్యక్షుడిగా ఫిరోజ్ ఖాన్(యూత్ వింగ్), జంగం నిర్మలా జ్యోతి(మహిళా విభాగం), సలాది వెంకటేశ్వరరావు (వెంకన్న, రైతు విభాగం), మారగాని రంగారావు (బద్రీ, బీసీ సెల్), పోడపాటి రవిబాబు (ఎస్సీ సెల్), శిఖ ఏసుమణి (ఎస్టీ సెల్), అబ్దుల్ కమల నాజర్ (మైనారిటీ సెల్), పొట్లా శ్యాం సుందర్ (క్రిస్టియన్ మైనార్టీ సెల్), ఉలిసి నాగదుర్గారాజ (స్టూడెంట్ వింగ్), కొత్తపల్లి వెంకటరెడ్డి (పంచాయతీరాజ్ వింగ్), బొడ్డు విజయ్‌కుమార్ (వలంటరీ వింగ్), బత్తుల వాసు (వాణిజ్య విభాగం), పోలన భవన్నారాయణ (వీవర్స్ వింగ్), బోడ వుల సాయి (వైఎస్సార్ టీయూసీ), ఆరేపల్లి శివ లక్ష్మీ(అంగన్‌వాడీ వింగ్), పులిపాక సత్యనారాయణ (అన్నవరం, కల్చరల్ వింగ్), జమ్మి రాంబాబు(రామ్ శ్రీ మహేష్, సోషల్ మీడియా వింగ్), కరవల్ల శ్యాంబాబు (దివ్యాంగుల విభాగం), కూనవరపు రాజశేఖర్ (బూత్ కమిటీ వింగ్), బుర్ల భోగేశ్వరరావు (పబ్లిసిటీ వింగ్) నియమితులయ్యారు.

ముదినేపల్లి మండలంలో నియామకాలు..

ముదినేపల్లి మండలానికి చెందిన పరసా ఏసురాజు (యూత్ వింగ్), రాచూరి రాధా (మహిళా విభాగం), బత్తుల దాసు (రైతు విభాగం), సోమ సత్యనారాయణ(బీసీ సెల్), వాసే జయరాజు(ఎస్సీ సెల్), మంచాల గంగయ్య (ఎస్టీ సెల్), షేక్ గౌస్ బేగ్ (మైనార్టీ సెల్), ఉచ్చుల స్వర్ణసరాజా(క్రిస్టియన్ మైనారిటీ సెల్), కాగిత హేమంత్ (స్టూడెంట్ వింగ్), సింగనపల్లి రామకృష్ణ (పంచాయతీరాజ్ వింగ్), బోయిన నాగేంద్ర (వలంటరీ వింగ్), దేవి సతీష్ (వాణిజ్య విభాగం), తుమ్మలచెర్ల సుధాకర్ (వీవర్స్ వింగ్), యార్లగడ్డ అంకలరావు (వైఎస్సార్ టీయూసీ), దూసనపూడి కుమారి(అంగన్‌వాడీ వింగ్), మరీదు వసంతరావు (కల్చరల్ వింగ్), శొంఠి రాము (సోషల్ మీడియా వింగ్), షేక్ ఆకాష్ (దివ్యాంగ విభాగం) బొర్రా రాంబాబు (బూత్ కమిటీ వింగ్), కొల్లి నాని(పబ్లిసిటీ వింగ్)లు నియమితులయ్యారు.

షెడ్యూల్డ్ కులాల ఉద్యోగ నియామకాలు నిలపాలి

గుడివాడ టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన కోటా ఉద్యోగాల నియామకాలు నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 31 ఏళ్ల వర్గీకరణ పోరాట ఫలితాలు మాదిగలకు దక్కడంలేదన్నారు. గత 18 ఏళ్లగా వర్గీకరణ విధానంలో మాదిగ సోదరులు నియామకాలకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ వర్గీకరణ చేపట్టారని.. దానిపై విచారణ జరిపిన కమిటీ మాలలకు 7.5 శాతం, మాదిగలకు 6.5 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించడం విచారకరమన్నారు. అభివృద్ధి చెందిన మాలలకు 1 శాతం అధికంగా రిజర్వేషన్ సౌకర్యం కల్పించడాన్ని ఎమ్మార్పీఎస్ వ్యతిరేకిస్తోందన్నారు. శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహించి 344 ఏపీ ఎమ్మార్పీఎస్ ప్రత్యేక ఉద్యమాన్ని చేపడుతున్నామన్నారు. మాదిగ సోదరులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్, రాష్ట్ర కన్వీనర్ పి.దేవానందం, జిల్లా ఇన్‌చార్జ్ కె.గంగాధరరావు, నాయకులు గంధం సైమన్‌బాబు, జె.ప్రశాంతి, సీహెచ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుడివాడ టౌన్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఏజీకే హైస్కూల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో 'నార్కోటిక్ డ్రగ్స్ వినియోగం–దుష్ప్రభావాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలపై అవగాహన, తెలియని వారితో అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వై.నాగేశ్వరరావు, జి.కిరణ్‌బాబులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

చేనేత కార్మికులపై కూటమి నిర్లక్ష్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

పెడన: కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. గురువారం పట్టణంలోని సర్వోదయ చేనేత సొసైటీ కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యాన చేనేత అధ్యయన యాత్రను ప్రారంభించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సంఘాలకు చెల్లించవలసిన రిబేట్, సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, మార్కెటింగ్ ఇన్సెంటివ్ రూ. 127.87 కోట్లను విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 7న జరిగిన చేనేత దినోత్సవంలో సీఎం ఇచ్చిన హామీ 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం అమలు కాకపోవడంపై విమర్శించారు. అక్టోబరు 2న చేనేత కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే నిరాహార దీక్షలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపుఇచ్చారు. చేనేత సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు బుగుడే మాధవస్వామి, ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో రామకృష్ణ

14న జిల్లా కార్యవర్గ ఎన్నికలు

మచిలీపట్నంఅర్బన్: ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కృష్ణా జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడాలి శేషయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే సర్వసభ్య సమావేశం అనంతరం ఎన్నికలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత

బంటుమిల్లి: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బంటుమిల్లి బ్రాంచి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సుమారు రూ. 30వేల విలువ చేసే ఐదు సైకిళ్లను బ్యాంకు మేనేజరు సీహెచ్ సందీప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు సీఎస్ఆర్ నిధులతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉద్యోగులకు, రైతులకు అందజేస్తున్న పలు రకాల రుణాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్ఎం జేవీ పద్మజ, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.